# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# తెలంగాణ రాష్ట్ర కమిటి

**పత్రిక ప్రకటన** **ఆగస్టు 29, 2019**

**బుడుగుల, రోళ్ళగడ్డ ఎన్‌కౌంటర్స్ వట్టి బూటకం.**

**కా॥జాడి వీరస్వామి, లింగన్నలను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లలో హత్య చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించండి!**

**ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు కొనసాగించడానికి కూంబింగ్‌లకు వస్తున్న పోలీసులను ప్రతిఘటించండి!**

**కూంబింగ్స్, ఎన్‌కౌంటర్స్ పేర హత్యలు చేయడాన్ని ఆపకపోతే టిఆర్ఎస్ పార్టీకి, బి.జె.పి పార్టీ నాయకులకు ప్రజల చేతిలో శిక్షలు తప్పవు.**

**ప్రియమైన ప్రజలారా!**

తెలంగాణ రాష్ట్రంలో కేసిఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో బి.జె.పి మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల, బహుళజాతి కంపెనీలతో కుమ్మక్కై కుట్రతో అడవిలో వున్న సంపదను దోచుకోవడానికి అడవుల నుండి, భూములనుండి ఆదివాసులను, పీడిత ప్రజలను గెంటివేయడానికి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా, హరితహారం పేరుతో, పర్యావరణ సంరక్షణ పేరుతో తెలంగాణాలోని ఏజెన్సీ ప్రాంతాన్ని భద్రాద్రి కొత్తగూడెం నుండి మొదలు మొహబూబబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, మంచిర్యాల, కొమరం భీం, ఆదిలాబాద్ జిల్లా వరకు గ్రే హౌండ్స్ – సిఆర్‌పిఎఫ్ బలగాలు పెద్దఎత్తున కూంబింగ్ ఆపరేషన్స్ కొనసాగిస్తున్నాయి. ఆదివాసులను, పీడిత ప్రజలను వందలాది మందిని అరెస్టు చేస్తూ చిత్రహింసలకు గురిచేస్తూ భూముల నుండి గెంటివేస్తూ జైళ్ళో పెడుతున్నారు. గ్రామాలను కూలుస్తూ, కాలబెడుతున్నారు. ఆదివాసుల భూముల రక్షణకోసం, ఆదివాసీలకు, పీడిత ప్రజలకు అండగా వున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో కేసిఆర్ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లకు పాల్పడుతున్నది. ఆగస్టు 21వ తారీఖు తెల్లవారుజామున మణుగూర్ దళం సభ్యులు కా॥జాడి వీరస్వామి, మరో ఇద్దరు సభ్యులు బుడుగుల గ్రామానికి సివిల్‌లో ప్రజలను కలవడానికి పోయారు. వీరి ఆచూకిని ఇన్‌ఫార్మర్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు కా॥వీరస్వామిని ఇంటివద్దనే పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాలతో ఎస్‌పి సునిల్‌దత్ నిర్ణయం ప్రకారం అడవిలోకి తీసుకపోయి హత్యచేసి ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు ఎప్పటిలాగే కట్టుకథ అల్లారు. జూలై 31వ తారీఖున న్యూ డెమోక్రసి పార్టీ నాయకుడు లింగన్నను రోళ్ళగడ్డ గ్రామ సమీపాన పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. దీనితో కోపోద్రిక్తులైన రోళ్ళగడ్డ గ్రామ ప్రజలు పోలీసులను రాళ్ళతో, కర్రలతో చితకబాది తుపాకులు గుంజుకున్నారు. రోళ్ళగడ్డ ప్రజల ప్రతిఘటననూ తెలంగాణ ప్రజలందరూ ఆదర్శంగా తీసుకొని కూంబింగ్‌లకు, దాడులకు వస్తున్న పోలీసులను ప్రతిఘటించాలని పిలుపునిస్తున్నాము.

కా॥జాడి వీరస్వామి, కా॥లింగన్నల బాటలో ఆదివాసులు, పీడిత ప్రజలు సాయుధమై పోరాడడం ద్వారానే భూములను రక్షించుకుంటాం. పోరాడితే పోయేదేమి లేదు. మన భూములు మనకు దక్కుతాయి. కూంబింగ్‌లు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపకపోతే టిఆర్ఎస్ పార్టీ, బి.జె.పి పార్టీ నాయకులకు ప్రజల ప్రతిఘటన తప్పదని హెచ్చరిక చేస్తున్నాం.

ఆగస్టు 26వ తారీఖున కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వాన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డీజిపిలు ఇతర కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నక్సల్స్ లేని నవ భారతాన్ని నిర్మిద్దామని ఉద్ఘాటించారు. వామపక్ష తీవ్రవాద నిర్మూలనకు రాష్ట్రాలు కోరినంత సహాకారం అందిస్తామని హామి ఇచ్చారు. బహుముఖ దాడికి పథకాలు వేశారు. తెలంగాణ నుండి హోంమంత్రి మహమూద్ ఆలీ, డిజిపి మహేందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశ లక్ష్యం బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు నిర్మించే నవభారతం. అది ఎలాంటిదంటే అంధవిశ్వాసాలతో, అశాస్త్రీయతతో కూడిన నిచ్చెనమెట్ల కులాధారిత ఫ్యూడల్ వ్యవస్థ. ఈ వ్యవస్థలో అగ్రవర్ణాల, ధనికుల, భూస్వాముల, దళారీ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదులకు మాత్రమే అన్ని హక్కులు, అధికారాలు వుంటాయి. పీడిత ప్రజలకు, పీడిత కులాలకు, జాతులకు, దళితులకు, మైనారిటీలకు, మహిళలకు, ఆదివాసులకు హక్కులు, అధికారాలు వుండవు. ఇలాంటి దోపిడీ హిందూ రాజ్యాన్ని స్థాపించేందుకు నవభారతం పేరుతో హిందూ మతోన్మాదులు ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో తమ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ఫాసిస్టు దాడులు కొనసాగిస్తున్నది. మావోయిస్టుల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా భావిస్తోంది. దళితులు, మైనారిటీలు, ఆదివాసులపై మూకదాడులతో హత్యలు చేస్తున్నది. తమ పథకంలో భాగంగానే జమ్మూ – కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే హక్కులు ఆర్టికల్స్ 370, 35–ఏ లను రద్దు చేసి కశ్మీర్ ప్రజల హక్కులను కాలరాశారు. భాజపా తెలంగాణాలో తమ బలం పెంచుకోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నది. "ఘర్ వాపస్", "లవ్ జిహాద్", "గో సంరక్షణ", "జై శ్రీరామ్" వగైరా పేర్లతో దాడులు చేసే అవకాశాలున్నాయి. తెలంగాణ, ఆంధ్రలో హిందూ దేవాలయాలపై తీవ్రవాదులు దాడులు చేసే అవకాశాలున్నాయని భాజపా బూటకపు ప్రచారం మొదలుపెట్టింది. దీని వెనక బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు చేసే కుట్ర దాగివుంది. ఈ విధంగా దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం అత్యంత ప్రమాదకరంగా మారుతున్నది.

రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వంతో కలిసి తెలంగాణ ప్రజల ఆకాంక్షలైనా నీళ్ళు, నిధులు, నియామకాలను, పౌరహక్కులను కాలరాస్తూ "సమాధాన్" వ్యూహంలో భాగంగా బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నాడు. నేడు దేశంలో, రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నది. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లను, దాడులను ఖండిస్తూ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు మిలిటెంట్‌గా, సమరశీలంగా పోరాడాలని పిలుపునిస్తున్నాం.

**విప్లవాభినందనాలతో,**

**అధికార ప్రతినిధి,**

**జగన్,**

**సీపిఐ (మావోయిస్టు),**